సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 19 । నవంబర్ । 2024



సోమశిలలో 70.34 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం 70.34 టీఎంసీల నీరు ఉంది. పెన్నార్ డెల్టాకు 50, కండలేరుకు 3వేలు, ఉత్తరకు 700, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.76,950
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.6,982
3శాతం జీఎస్టీతో	రూ.7,191
నవర (8గ్రా)	రూ.57,528

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.8 /24.9

జిల్లాలో మంగళవారం వాతావరణం సాధారణంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ సోమవారం 73 శాతంగా నమోదైంది.

సంక్షోభ హాస్టళ్లు!

జిల్లాలో సంక్షేమ హాస్టళ్లు.. సంక్షోభంగా మారాయి. ఆయా భవనాల పైకప్పులు పెచ్చులూడిపోయి ఏ క్షణాన్నైనా కూలిపోయేలా కనిపిస్తున్నాయి. హాస్టళ్లకు తలుపులు, కిటికీలు ఉన్నా విరిగిపోయి ఉన్నాయి. బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు నిర్వహణ సరిగాలేక దుర్వాసన కొడుతున్నాయి. పలు హాస్టళ్లలో విద్యార్థులకు బెడ్‌షీట్లు పంపిణీ చేయకపోవడంతో ఇళ్ల నుంచి తెచ్చుకుని వాడుకుంటున్నారు. సోమవారం జిల్లావ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లను సాక్షి బృందం విజిట్ చేయగా ఈ చేదు వాస్తవాలు వెలుగు చూశాయి.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

పేద విద్యార్థులపై బాబు సర్కార్ నిర్లక్ష్యం

- శిథిల భవనాలు.. సక్రమంగా లేని మరుగుదొడ్లు
- గురుకులాల్లో ఐదు నెలలుగా నిత్యావసరాల నిధుల నిలిపివేత
- వంటగ్యాస్‌కు నిధులు లేక అప్పులతో నెట్టుకొస్తున్న ప్రిన్సిపల్స్
- విద్యార్థులకు కాస్మొటిక్స్ చార్జీలు అందని వైనం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: పేద పిల్లలకు పెట్టే భోజనానికి నిధులు ఇవ్వలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉంది. గురుకులాల్లో ఐదు నెలలుగా ఉద్యోగులు, అధ్యాపకులకు జీతాలు రావడం లేదు. వెండర్లు అప్పులు తెచ్చి గురుకులాలకు పప్పులు, గ్యాస్, కూరగాయలు సరఫరా చేస్తున్నారు. హాస్టళ్ల డైట్ చార్జీలకు ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోతే సప్లయ్ నిలిపేస్తామని వెండర్లు చెబుతున్నారు. పరిస్థితి ఇలానే ఉంటే ఎప్పుడైనా సప్లయ్ నిలిచిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వసతి గృహాల్లో 12 వేలకు పైగా

జిల్లా వ్యాప్తంగా వివిధ సంక్షేమ హాస్టళ్లలో సుమారు 12 వేల మందికి పైగా విద్యార్థులున్నారు. వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం, కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు ఖర్చు చేస్తోంది. నిధులు ఖర్చు చేస్తున్నా అవి మాత్రం బాగుపడటం లేదు. వాటిలో ఉండే విద్యార్థినీ, విద్యార్థులు అవస్థలు పడుతూ చదువులు కొనసాగిస్తున్నారు.

నీళ్లచారు, ఉడకని అన్నం

డైట్ చార్జీలు నిలిపి వేయడంతో హాస్టళ్లలో విద్యార్థులకు పెట్టే మెనూ పూర్తిగా మారిపోయింది. ఉడకని అన్నం, నీళ్ల చారుతోనే సరిపెడుతున్నారు. వసతి గృహాల్లో పెట్టే భోజనం తినలేక విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. కొందరు బయట నుంచి ఆహారాన్ని తెప్పించుకుని తింటున్నారు.



కావలి బీసీ బాలుర వసతి గృహంలో నిరుపయోగంగా స్నానపు గదులు

విద్యార్థినులకు భద్రత కరువు

సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థినులకు భద్రత కరువైంది. రక్షణ సౌకర్యాలు లేకపోవడం, పర్యవేక్షణ చేసే అధికారులు లేకపోవడంతో భద్రత లేకుండా పోతుంది. లేడీస్ హాస్టళ్లలో మెట్రిన్‌ల భర్తలే కొన్ని చోట్ల అజమాయిషీ చేస్తున్నారు. చీకటి పడితే చాలు హాస్టళ్ల పరిసర ప్రాంతాల్లో మందుబాబులు తిరుగుతున్న పరిస్థితి ఉంది.

ఎస్సీ హాస్టళ్లు	- 71
విద్యార్థులు	- 4,500
బీసీ హాస్టళ్లు	- 63
విద్యార్థులు	- 5,569
ఎస్టీ హాస్టళ్లు	- 12
విద్యార్థులు	- 2,310

కావలిలో...



కావలి బీసీ బాలుర హాస్టల్‌లో కిటికీ రెక్కలకు దుస్తులు ఆరబెట్టుకున్న దృశ్యం

కావలి: కావలి పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థుల స్నానపు గదులు శిథిలమైపోయాయి. దీంతో ఆరు బయటే స్నానాలు చేస్తున్నారు. 103 మంది విద్యార్థులున్న బీసీ హాస్టల్‌లో కనీసం ఉతికిన దుస్తులు ఆరబెట్టుకోవడానికి వసతి లేదు. దీంతో గదుల్లో కిటికీల రెక్కల పైన, గదిలో అడ్డంగా తాడు కట్టుకొని వాటిపై ఆరబెట్టుకుంటున్నారు. వంట చేసే గది కిటికీకి రెక్కలు సరిగా లేకపోవడంతో వర్షం కురిస్తే జల్లులు గదిలో పడుతుంటాయి. అలాగే కావలి పట్టణంలో ఎస్సీ -3 బాలుర హాస్టల్‌లో 40 మంది విద్యార్థులు ఉంటే, వారు వాడుకునే ప్లాస్టిక్ బక్కెట్లను వారి వస్తువులు భద్రపరుచుకునే పెట్టెల చిలుకలకే బిగించుకుంటున్నారు. బక్కెట్లను భద్రపరుచుకునే ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో విద్యార్థులకు ఈ దుస్థితికి నెలకొంది.

కలిగిరిలో..

కలిగిరి: కలిగిరిలో బీసీ బాలికల వసతి గృహం, సిద్ధనకొండూరులో ఎస్సీ బాలుర వసతి గృహాలు ఉన్నాయి. కలిగిరిలోని బీసీ బాలికల వసతి గృహంలో 12 మంది విద్యార్థినులున్నారు. అద్దె భవనంలో దీనిని నిర్వహిస్తున్నారు. వింజమూరు బాలికల వసతి గృహం వార్డెన్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. రోజు మార్చి రోజు వచ్చి చూసి వెళుతుంటారు. సిద్ధనకొండూరు బాలుర వసతి గృహంలో 43 మంది విద్యార్థులు ఉన్నారు. ఇది శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. విద్యార్థులు ఉండే గదులకు తలుపులు, కిటికీలు సక్రమంగా లేవు. స్లాబులు పెచ్చులూడి పడుతున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా గదులన్నీ ఉరుస్తున్నాయి. ఫ్లోరింగ్ పూర్తిగా దెబ్బతింది. బాత్‌రూములు కొన్నింటికి తలుపులు లేవు. ప్రహరీ లేకపోవడంతో తరచూ పొలాల్లో నుంచి విషసర్పాలు, కీటకాలు వసతి గృహంలోకి వస్తున్నాయి.



సిద్ధనకొండూరులోని ఎస్సీ బాలుర వసతి గృహంలో తలుపులు లేని మరుగుదొడ్లు

దుత్తలూరులో..



దుత్తలూరు మరుగుదొడ్ల పరిసరాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు

దుత్తలూరు: దుత్తలూరులోని బీసీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉంది. ఇందులో 40 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ గదుల్లో శ్లాబులు పెచ్చులూడి ఇబ్బందికరంగా ఉంది. అలాగే మరుగుదొడ్ల పరిసరాలు పిచ్చిచెట్లతో నిండి ఉన్నాయి. హాస్టల్ విద్యార్థులకు ఇంతవరకు దుప్పట్లు, ట్రంకుపెట్టెలు, నోటుపుస్తకాలు, కాస్మొటిక్ చార్జీలు అందకపోవడంతో తల్లిదండ్రులు వారి సొంత ఖర్చులతోనే వస్తువులు కొనుగోలు చేసి ఇచ్చారు.

ఉదయగిరిలో...

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలో ఎస్సీ సంక్షేమ వసతి గృహాలు 5, బీసీ సంక్షేమ వసతి నిలయాలు 14 ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు వెయ్యిమంది వరకు వసతి పొందుతున్నారు. వింజమూరులోని బీసీ, ఎస్సీ బాలుర వసతిగృహాలలో పారిశుధ్య పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయి. మరుగుదొడ్లు సక్రమంగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. భవనాల స్లాబులు పెచ్చులూడి పడుతున్నాయి. వర్షం కురిస్తే ఉరుస్తున్నాయి. జలదంకి, కలిగిరి, కొండాపురం వసతి గృహాలలో కూడా ఇదే పరిస్థితి నెలకొనివుంది.



శ్లాబు పెచ్చులూడిన వింజమూరులోని ఎస్సీ వసతిగృహం

వరికుంటపాడులో..

వరికుంటపాడు: వరికుంటపాడులో బీసీ సంక్షేమ శాఖ వసతి గృహం శిథిలావస్థకు చేరింది. స్లాబులు పెచ్చులూడి పడిపోవడంతోపాటు, చిన్నపాటి వర్షాలకే ఉరుస్తున్నాయి. వసతి గృహంలో 25 మంది విద్యార్థులు ఉంటున్నారు. 10 గదులు ఉండగా రెండు గదులు మాత్రమే బాగున్నాయి. ఒక గదిలో విద్యార్థులు ఉండగా, మరొకటి స్టోర్, ఆఫీసు రూమ్‌గా నిర్వహిస్తున్నారు. అలాగే కాకొల్లువారిపల్లెలో వసతి గృహంలో 30 మంది విద్యార్థులు ఉంటున్నారు. 10 రూములు ఉండగా రెండు రూములు మాత్రమే ఓ మోస్తరుగా ఉన్నాయి. మిగిలిన గదులన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి.



వరికుంటపాడులో పెచ్చులు ఊడి ప్రమాదకరంగా ఉన్న హాస్టల్ గది

సీతారామపురంలో..

సీతారామపురం: మండలంలో మూడు బాలుర, రెండు బాలికల వసతిగృహాలుండగా.. ఎస్సీ, బీసీ బాలుర వసతిగృహాలు మరమ్మతులకు గురయ్యాయి. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తికాకపోవడంతో విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. కాస్మొటిక్ చార్జీలు చెల్లించకపోవడంతో బాలికలు ఇంటినుంచే సబ్బు, నూనె వంటివి తెచ్చుకుంటున్నారు. సీతారామపురం, అయ్యవారిపల్లి బీసీ వసతి గృహాలకు గల ఇన్‌చార్జి వార్డెన్ రెండ్రోజులకోసారి వచ్చి పోతుండగా వంటమనుషులు, వాచ్‌మెన్ల పర్యవేక్షణలో విద్యార్థులు ఉంటున్నారు. ఆదర్శ పాఠశాల బాలికల వసతిగృహంలో వంటగది వెనుకవైపుగల తలుపు లేకపోవడం, పరిసరాల ప్రాంగణంలో విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో రాత్రివేళల్లో విద్యార్థినులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.



సీతారామపురం కేజీబీవీలో పనిచేయని కుళాయిలు

కందుకూరులో..

కందుకూరు: పట్టణంలోని సంతోష్‌నగర్‌లో ఉన్న బీసీ బాలుర వసతి గృహం సొంత భవనంలోనే ఉన్నా.. శిథిలావస్థకు చేరింది. పెచ్చులూడిపడుతూ చిన్నపాటి వర్షం కురిస్తే శ్లాబు కారుతోంది. మరుగుదొడ్లు కూడా తలుపు లేకుండా దుర్వాసన వెదజల్లుతోంది. బీసీ బాలుర కళాశాల వసతి గృహం భవనం మొత్తం ఉప్పురిసి సిమెంట్ రాలిపోతోంది. మరుగుదొడ్లు నిరుపయోగంగా మారడంతో అందులోకి ఎవరినీ పోనివ్వకుండా గోతాలు కట్టారు. లింగసముద్రం మండలంలో ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాల్లో మరుగుదొడ్లు లేక విద్యార్థులు బహిర్భూమికి పొలాల్లోకి వెళ్తున్నారు.



కందుకూరు బీసీ కళాశాల బాలుర హాస్టల్‌లో మరుగుదొడ్లకు అడ్డం కట్టిన గోతాలు



సంగం ఎస్సీ బాలికల వసతి గృహం ఆవరణలో నిలిచిన నీరు

ఆత్మకూరులో..

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో 250 మంది విద్యార్థులకు స్నానాలు చేసేందుకు నాలుగే బాత్‌రూములు ఉన్నాయి. ఇవి దుర్గంధంతో ఉన్నాయి. దీంతో విద్యార్థులు ఆరుబయట, బాత్ రూము వరండాలలో స్నానాలు చేస్తున్నారు. పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహం జేఆర్‌పేటలోని ఓ రేకుల అద్దె ఇంటిలో నిర్వహిస్తున్నారు. దీనికి ఇరువైపులా ఇరిగేషన్ కాలువ, మున్సిపల్ కాలువ ఉండడంతో వర్షాకాలంలో మురుగు నీరు అంతా హాస్టల్‌లోకి చేరి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పందులు, పాములు సంచరిస్తున్నాయి



ఆత్మకూరు బీసీ హాస్టల్‌కు ప్రహరీ లేకపోవడంతో పందులు, పాములు సమీపంలోని కాలువల నుంచి హాస్టల్లోకి వస్తున్నాయి. రాత్రి సమయాల్లో హాస్టల్ సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు హాస్టల్‌ను పక్కా భవనంలోకి మార్చాలి.

– విద్యార్థులు మనోజ్, సంతోష్, మదన్,

న్యూస్‌రీల్

15 మంది అధికారులకు మెమోలు

- జారీచేసిన జేసీ కార్తీక్
- విధుల్లో నిర్లక్ష్యంపై చర్యలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ కార్తీక్

నెల్లూరు(అర్బన్): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సకాలంలో హాజరుకాని 15 మంది జిల్లా అధికారులకు జాయింట్ కలెక్టర్ కార్తీక్ మెమోలు జారీ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జేసీ హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా 10.30 గంటలు దాటినప్పటికీ పలువురు అధికారులు హాజరు కాలేదు. కొంతమంది చాలా ఆలస్యంగా వచ్చారు. దీంతో విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నారంటూ అసంతృప్తి వ్యక్తం చేసిన జేసీ మెమోలు జారీ చేశారు.

ఇదే సందర్భంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపై ఇచ్చిన అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఇకపై మండల, మున్సిపల్ కేంద్రాలలో సైతం ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు దగ్గరలోని మండల కార్యాలయాల్లో అర్జీలు ఇవ్వవచ్చన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 195 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ ఉదయభాస్కర్, జెడ్పీ ఇన్‌చార్జి సీఈఓ మోహన్‌రావు, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, డ్వామా పీడీ గంగా భవానీ, డీటీసీ చందర్, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, సర్వజన ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ అధికారి డాక్టర్ సుశీల్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ సీఈఓగా విద్యారమ

నెల్లూరు (పొగతోట): శ్రీకాళహస్తి ఈటీసీలో విధులు నిర్వహిస్తున్న ఎం.విద్యారమను నెల్లూరు జిల్లా పరిషత్ సీఈఓగా నియమిస్తూ పంచాయతీ రాజ్ శాఖాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరులో జెడ్పీ సీఈఓగా ఒక్క రోజు పనిచేసి సెలవుపై వెళ్లిన ఖాదర్‌బాషాను నగరి డీఎల్‌డీఓగా బదిలీ చేశారు. డ్వామా పీడీగా పనిచేస్తూ పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న పి.వెంకట్రావ్‌ను బాపట్ల ఈటీసీ ప్రిన్సిపల్‌గా నియమించారు.

సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): యుపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో విజయవాడలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈనెల 24వ తేదీలోపు తమ దరఖాస్తులను జిల్లా బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో అందచేయాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 27న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు నేరుగా గానీ, లేదా 93815 54779, 93902 39588 ఫోన్ నంబర్ల ద్వారా సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయుడి దాడి ఘటనపై విచారణ



ఉపాధ్యాయుడి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్, బీఎస్పీ నాయకులు

కలిగిరి: కలిగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని కొట్టి, టీసీ ఇవ్వడానికి కారణమైన తెలుగు ఉపాధ్యాయుడు మన్నం శ్రీనివాసులు తీరుపై జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో కావలి డిప్యూటీ డీఈఓ రఘురామయ్య సోమవారం విచారణ చేపట్టారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో వేరువేరుగా విచారణ జరిపారు. టీసీ జారీ చేసిన విద్యార్థి చేవూరి అభిషేక్‌ను తిరిగి పాఠశాలలో కొనసాగించేలా చర్యలు తీసుకున్నారు. డిప్యూటీ డీఈఓ రాఘురామయ్య మాట్లాడుతూ విద్యార్థికి టీసీ ఇవ్వడం ఉపాధ్యాయులు చేసిన మంచి నిర్ణయం కాదు. ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రులు, ఇతరులు లిఖిత పూర్వకంగా ఇచ్చిన వివరాలతో పాటు తన విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాలువ పూడికతీతలో రూ.30 కోట్లకు స్కెచ్

- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి కాజేసేందుకు యత్నం
- తూతూ మంత్రంగా పనులు ముగించి బిల్లులు సిద్ధం చేస్తున్నారు
- విలేకరులతో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): కనుపూరు కాలువ పూడికతీత పనుల ద్వారా రూ.30 కోట్లు దోచుకునేందుకు సర్వేపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్కెచ్ వేశారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఇరిగేషన్ శాఖలో అవినీతి జరిగిందంటూ చెబుతున్న సోమిరెడ్డి.. నిస్సిగ్గుగా రైతులను అడ్డుపెట్టుకుని దోచుకునేందుకు తెరతీశారన్నారు. టెండర్లకు కాలపరిమితి ఉన్నప్పటికీ తూతూ మంత్రంగా పనులు ముగించి బిల్లులు సిద్ధం చేస్తున్నారన్నారు. కనుపూరు కాలువ పూడికతీత కోసం రూ.6 కోట్లకు సంబంధించి పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిస్తే నాసిరకంగా నామమాత్రంగా పనులు పూర్తి చేశారన్నారు. దీనిని బట్టి చూస్తే ప్రజాధనాన్ని ఎలా దోచుకుంటున్నారో ఇట్టే అర్థమవుతుందన్నారు. కనుపూరు కాలువ పూడిక తీత పనులను సక్రమంగా జరగడం లేదని వాటిని తాము పరిశీలిస్తామని రైతులు చెబితే వారిని వెళ్లనివ్వలేదన్నారు. అంతేకాకుండా తాను పరిశీలించేందుకు వెళ్తానంటే హౌస్ అరెస్ట్ చేయించారన్నారు. నవంబర్ 11వ తేదీ వరకు గడువు ఉంటే సోమిరెడ్డి 7వ తేదీనే కనుపూరు కాలువ వద్దకు వెళ్లి నీటిని విడుదల చేయించి 30 పొక్లెయిన్లు, 15 డోజర్లతో కాలువలో పూడిక తీత పనులు చేపట్టినట్లుగా పత్రికలకు స్టేట్ మెంట్ ఇచ్చారన్నారు. సర్వేపల్లిలో రూ.6 కోట్ల అవినీతితో పాటు మరో రూ.25 కోట్లకు ప్రతిపాదనలు పంపించారని చెప్పారు. అంటే నీరు పారేటప్పుడే ఆ పనులు చేసినట్లుగా దొంగ బిల్లులు చేసుకోవడానికి మొత్తంగా రూ.30 కోట్లకు స్కెచ్ వేశారని వివరించారు. ఈ విషయంపై ఇరిగేషన్ అధికారులతో మాట్లాడితే సరైన సమాధానం చెప్పలేదన్నారు. విచారణలో ప్రజాధనం దుర్వినియోగమైందని రుజువైతే సంబంధిత అధికారులు ఎవరైనా సరే జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. సర్వేపల్లిలో అనేక చోట్ల నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న మాట వాస్తవమని దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకునే పనైతే సాక్ష్యాధారాలతో సహా చూపిస్తామన్నారు. ఇటీవల తనను భయపెట్టి రూ.3లక్షలు డిమాండ్ చేశారని ఓ దళితుడు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో చెప్పారని, ఈ విషయంలో సోమిరెడ్డిపై పోలీసులు కేసుపెట్టి విచారించాలన్నారు.

టీడీపీ నాయకుడి భూ ఆక్రమణ

- కోర్టు స్టేటస్‌కో ఇచ్చినా బేఖాతరు
- వివాదాస్పద భూముల్లో సాగు పనులు
- న్యాయం చేయాలని ఆర్డీఓకు దళితుల విన్నపం



వివాదాస్పద భూముల్లో ట్రాక్టర్‌తో సాగు చేస్తున్న దృశ్యం (ఫైల్)



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న బాధితుడు ప్రసాద్

ఆత్మకూరు: ఆయన ఓ మాజీ ఎమ్మెల్యే సోదరుడు. తాను చెప్పినట్లే జరగాలని గతంలో అధికారులను శాసించేవాడు. పలువురు వీఆర్‌ఓలను, అధికారులను లోబరుచుకొని రికార్డులు తారుమారు చేసి దళితుల భూములు ఆక్రమించుకున్నాడు. ఓ కుటుంబం భూముల ఆక్రమణపై హైకోర్టులో పిటిషన్ వేయగా ఆ భూముల్లో ఎవరూ దిగరాదని 'స్టేటస్‌కో' ఇచ్చింది. దానిని బేఖాతరు చేస్తూ రెండు రోజులుగా ఆ భూమిలో ట్రాక్టర్‌తో దున్నిస్తున్నాడు. వివరాల్లోకెళ్తే.. చేజర్ల మండలం పెళ్లేరు పంచాయతీ పరిధిలో సర్వే నంబరు 511లో ఐదు ఎకరాల భూమిని మిలటరీ మాజీ ఉద్యోగి చేజర్ల పెంచలయ్యకు 1976లో ప్రభుత్వం పంపిణీ చేసింది. ఆయనకు ఇద్దరు కుమార్తెలు కాగా, పసుపు కుంకుమల కింద చెరి రెండున్నర ఎకరాలు పంచి రిజిస్ట్రేషన్ చేశాడు. అయితే ఆయన కుమార్తె దొంతాలి పెంచలమ్మకు చెందిన 2.50 ఎకరాల భూమిని సదరు నాయకుడు స్వాధీనం చేసుకొని సాగు చేస్తుండడంతో ఆమె భర్త ప్రసాద్ హైకోర్టులో కేసు దాఖలు చేశాడు. కోర్టు స్టేటస్ కో ఇచ్చినా సదరు నాయకుడు భూమిలో సాగు పనులు చేపట్టాడు. అడు గుతుంటే దిక్కున్న చోట చెప్పుకోవాలని బెదిరిస్తున్నాడని బాధిత కుటుంబం వాపోయింది. ఆత్మకూరు ఆర్డీఓ బి పావనిని కలిసి వివాదం గురించి తెలియజేసి వినతి పత్రం అందజేసింది.

ఆక్రమణే ఆయన నైజం

సదరు టీడీపీ నాయకుడు తప్పుడు సర్టిఫికెట్లతో వీఆర్‌ఓగా కొంతకాలం పనిచేశాడు. తరువాత విచారణ జరిపి ఉద్యోగం నుంచి తొలగించారు. విధుల్లో ఉన్నప్పుడే దళితులకు ప్రభుత్వం ఇచ్చిన భూములపై అతని కన్నుపడింది. పలువురు కింది స్థాయి రెవెన్యూ అధికారులను లోబరుచుకొని భూములను ఆక్రమించుకొని రికార్డులు తారుమారు చేసి తన భూములుగా చెప్పుకుంటూ దర్జాగా సాగు చేస్తున్నాడు. పెళ్లేరు పంచాయతీ పుల్లనీళ్లపల్లి గ్రామంలో పెన్నానది తీరంలో సర్వే నంబర్లు 508, 509, 510, 511, 512లో 4 దశాబ్దాల క్రితం అప్పటి ప్రభుత్వం కుటుంబానికి ఎకరా చొప్పున మొత్తం 43 ఎకరాలు పంపిణీ చేసింది. అయితే స్థానిక టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సోదరుడు ఆ భూమిని ఆక్రమించుకున్నాడు. గత ప్రభుత్వ కాలంలో దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి దీనిపై విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక అందజేయాలని అప్పటి ఆర్డీఓను ఆదేశించారు. విచారణ అనంతరం వివాదాస్పద భూముల్లోకి ఎవరూ వెళ్లరాదని ఆదేశాలు జారీ చేశారు. అయినా ఆ భూములను ఆయన సాగు చేస్తున్నట్లు బాధిత దళిత కుటుంబీకులు తెలిపారు. ఈ విషయమై ఆత్మకూరు ఆర్డీఓ బి పావనిని సంప్రదించగా మండల తహసీల్దారును ఆ భూముల విషయమై పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు, ఆ నివేదిక మేరకు కలెక్టర్‌కు తెలియజేసి బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

పాత పనులకు కొత్త బిల్లులు

- అనికేపల్లిలో టీడీపీ నేతల నిర్వాకం
- సీసీ రోడ్ల నిర్మాణంపై నాడు తీవ్ర విమర్శలు
- బిల్లులు నిలిపివేసిన జిల్లా అధికారులు
- నేడు ఒత్తిడి తెచ్చి గ్రామసభ ఏర్పాటు
- డబ్బులిచ్చి, కూలీలను పిలిపించిన వైనం


అనికేపల్లిలో ఏర్పాటు చేసిన గ్రామసభ


గ్రామసభకు వచ్చిన కూలీలకు నగదు పంపిణీ

వెంకటాచలం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ నేతల అవినీతికి అంతు లేకుండా పోయింది. గ్రావెల్, ఇసుక అక్రమరవాణా, ఇరిగేషన్ పనుల్లో అవినీతితో అందినకాడికి దోచుకుంటున్నారు. తాజాగా వెంకటాచలం మండలం అనికేపల్లిలో గత టీడీపీ ప్రభుత్వంలో ఎలాంటి తీర్మానాలు లేకుండా చేసిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు బిల్లులు చేసుకుని జేబులు నింపుకొనేందుకు గ్రామసభ నిర్వహించారు.

అధికారం అండతో..

అనికేపల్లితోపాటుగా, పంచాయతీ పరిధిలోని గొలగమూడి గ్రామంలో 2018 – 19 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం కింద టీడీపీ నేతలు అధికారం అండతో ఎలాంటి తీర్మానాలు లేకుండానే సీసీ రోడ్లు నిర్మించారు. దీనిపై అధికారుల పర్యవేక్షణ కూడా లేదు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా రోడ్లు వేశారు. ఈ వ్యవహారంపై అప్పట్లో పత్రికల్లో కథనాలు ప్రచురితమవడంతో జిల్లా అధికారులు నాటి ఎంపీడీఓ, పంచాయతీరాజ్, ఉపాధి హామీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి కొన్ని పనులకు తీర్మానాలు ఉండటంతో సంబంధిత సీసీ రోడ్లు నాణ్యతను పరిశీలించి బిల్లులు మంజూరు చేశారు. సుమారు రూ.3 కోట్ల విలువైన పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, తీర్మానాలు లేకపోవడంతో ఆ బిల్లులు నిలిపివేశారు.

నేడు సక్రమమా?

కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో రూ.3 కోట్ల పనులకు బిల్లులు పొందాలని టీడీపీ నేతలు కుట్రలకు తెరతీశారు. అందులో భాగంగా జిల్లా కమిటీ పేరుతో ఈనెల 16వ తేదీన అనికేపల్లిలో గ్రామసభ నిర్వహించేందుకు అధికారులపై ఒత్తిడి తెచ్చారు. అధికారులు హాజరుకాగా, గ్రామం నుంచి ఎవరూ వెళ్లలేదు. సీసీ రోడ్ల పనులు సక్రమంగా జరగలేదని, తాము ఎందుకొచ్చి సభలో చెప్పాలని గ్రామస్తులు టీడీపీ నేతలను నిలదీశారు. దీంతో సభను వాయిదా వేశారు. ఇంతటితో ఆగకుండా సోమవారం ఒక్కో కూలీకి రూ.500 నగదు ఇచ్చి గ్రామంలోనే సభ పెట్టారు. ఇందులో ఎంపీడీఓ కల్పన, పంచాయతీరాజ్, ఉపాధిహామీ తదితర శాఖల అధికారులు హాజరై నాటి సీసీ రోడ్ల నిర్మాణాలకు సంబంధించిన పనుల వివరాలను చదివి వినిపించారు. అవి కూలీలకు తెలియకపోవడంతో అక్కడే ఉన్న టీడీపీ నాయకులు పనులు జరిగాయని, చేతులు పైకి ఎత్తాలని ఒత్తిడి చేయడంతో అలాగే చేశారు. అప్పట్లోనే ఈ పనులు అక్రమమని తేల్చిన అధికారులు, ప్రస్తుతం టీడీపీ నేతలకు బిల్లుల కోసం సభ నిర్వహించడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు.


నాణ్యత సక్రమంగా లేని సీసీ రోడ్డు

అధికారులకు వినతులు

నెల్లూరు రూరల్: నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో సోమవారం జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు విచ్చేసి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఏఎస్‌పేటలో కామాక్షి కళ్యాణ మండపం సమీపంలో పంచాయతీకి చెందిన సర్వే నంబర్ 133లో సుమారు 120 అంకణాల బావిని పూడ్చివేసి రూ.కోటికి అమ్మేశారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. నగరంలోని కొండాయపాళెం వద్ద బీసీ భవనం నిర్మాణం ఆగిపోయిందని, వెంటనే పనులు మొదలుపెట్టాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం నేతలు కోరారు. బీవీనగర్‌లోని బాలికల వసతి గృహంలో కొత్త గదుల నిర్మాణాలు చేపట్టాలన్నారు.

నిందితులను తప్పించేందుకు టీడీపీ నేతల ఒత్తిళ్లు

- బాలికపై యువకుడి లైంగికదాడి
- ఈ ఘటనలో నిందితుడి కుటుంబసభ్యుల పాత్ర
- అరెస్ట్ చేయాలని బాధితురాలి తండ్రి డిమాండ్

నెల్లూరు సిటీ: ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని ఓ బాలికపై పెంచలయ్య అనే యువకుడు లైంగికదాడికి పాల్పడిన విషయం తెలిసిందే. నిందితుడిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే ఈ కేసులో అతడి కుటుంబసభ్యుల పాత్ర కూడా ఉందని వెంటనే వారిని కూడా అరెస్ట్ చేయాలని బాధితురాలి తండ్రి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన జీజీహెచ్ వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెంచలయ్య తన కుమార్తెకు మాయమాటలు చెప్పి కొంతకాలంగా శిథిలావస్థకు చేరిన ఇంట్లోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడని చెప్పారు. పెంచలయ్యకు అతడి కుటుంబసభ్యులు సహకరించారని ఆరోపించారు. అయితే కేవలం యువకుడిని మాత్రమే అరెస్ట్ చేశారని, అతడికి సహకరించిన కుటుంబసభ్యులను కేసులో చేర్చలేదన్నారు. టీడీపీ నేతల ఒత్తిడితోనే పోలీసులు కుటుంబసభ్యుల పేర్లు తొలగించారన్నారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తన కుమార్తెకు న్యాయం చేయాలని కోరారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి


నూర్జహాన్ మృతదేహం

నెల్లూరు(క్రైమ్): ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన నెల్లూరు వీఆర్సీ సెంటర్‌లో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. జెండావీధి పీఎస్‌ఎం స్కూల్ సమీపంలో షేక్ నూర్జహాన్ (48) కుటుంబం నివాసం ఉంటోంది. ఆమెకు ముగ్గురు సంతానం. సోమవారం సాయంత్రం ఆమె మందులు తీసుకొచ్చేందుకు వీఆర్సీ సెంటర్‌లోని మెడికల్ షాపునకు వెళ్లారు. మందులు తీసుకుని నడుచుకుంటూ వెళ్తుండగా వాకాడు ఆర్టీసీ బస్సు వేగంగా ఆమెను ఢీకొంది. ముందు చక్రాలు ఆమెపైకి ఎక్కడంతో తీవ్రగాయాలయ్యాయి. నూర్జహాన్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం సమీపంలోని జయభారత్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు మృతురాలి చిన్నకుమారుడు హైదర్‌అలీ సౌత్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

నిమ్మ ధరలు
పెద్దవి : రూ.45
సన్నవి : రూ.35
పండ్లు : రూ.20

పౌల్ట్రీ ధరలు
బ్రాయిలర్ (లైవ్) : 110
లేయర్ (లైవ్) : 110
బ్రాయిలర్ చికెన్ : 206
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 230
లేయర్ చికెన్ : 187

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్


ప్లకార్డులు పట్టుకుని ధర్నా చేస్తున్న వలంటీర్లు

నెల్లూరు రూరల్: నెల్లూరు కలెక్టరేట్ సోమవారం ధర్నాలతో దద్దరిల్లింది. జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ టీచర్లు 4వ రోజు కూడా విధులు బహిష్కరించి గాంధీబొమ్మ సెంటర్ నుంచి ర్యాలీగా కలెక్టర్ కార్యాలయం వద్దకు వెళ్లి ధర్నా చేశారు. ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల అవుట్ సోర్సింగ్ టీచర్స్ యూనియన్ జిల్లా నాయకులు కె.శ్రీనివాసులు, టి.అనిత, ఈవీ సూర్య నారాయణ మాట్లాడారు. చాలీచాలని జీతాలిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం తమను గుర్తించకపోవడం దారుణమన్నారు. మెగా డీఎస్సీలో గిరిజన గురుకులాల్లోని పోస్టులను మినహాయించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.తార, కేవీ రమణ, నాయకులు కోట శ్రీనివాస రావు, ఏడుకొండలు, బుజ్జమ్మ, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

జీఓ విడుదల చేయాలని..

ప్రభుత్వం ఆశవర్కర్ల యూనియన్‌తో చేసుకున్న ఒప్పంద జీఓలను వెంటనే విడుదల చేయాలని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షురాలు కె.విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణమ్మ డిమాండ్ చేశారు. వారి ఆధ్వర్యంలో ఆశవర్కర్లు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఇటీవల అనేకమంది ఆశవర్కర్లు పదవీ విరమణ చేస్తే వారికి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందలేదన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలంటూ..

ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు వలంటీర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హుమాయున్‌బాషా ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. వారు మాట్లాడుతూ వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజీనామా చేసిన వాళ్లని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం వలంటీర్లకు అవార్డులు ఇచ్చిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రూ.10 వేల వేతనం చెల్లిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 108 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) కలెక్టరేట్ ఎదుట ఒకరోజు రిలే నిరాహార దీక్ష చేపట్టింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 25న సమ్మెకు వెళ్తామన్నారు. 108 అంబులెన్సులను ప్రభుత్వమే నిర్వహించి అందులోని ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. రోజుకు మూడు షిఫ్ట్‌ల్లో ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలన్నారు. వైద్యారోగ్య శాఖ ఈఎంటీ పోస్టుల నియామకాల్లో 108లో పని చేస్తున్న ఈఎంటీలను నియమించాలన్నారు. సహజ, ప్రమాద మరణం పొందిన ఉద్యోగి కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. కార్యక్రమంలో 108 యూనియన్ జిల్లా అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి నాగరాజు, ట్రెజరర్ కృష్ణయ్య పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ఏపీ ఆశవర్కర్స్ యూనియన్


గిరిజన గురుకులాల టీచర్ల ధర్నా


108 ఉద్యోగుల నిరసన

లోన్ యాప్ నిర్వాహకులు వేధిస్తున్నారు


అర్జీదారుల సమస్యలు వింటున్న ఎస్పీ కృష్ణకాంత్

- పోలీసులకు ఫిర్యాదు చేసిన అల్లూరు వాసి
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 85 అర్జీలు

నెల్లూరు(క్రైమ్): 'లోన్ యాప్‌లో నగదు తీసుకున్నాను. అప్పును పూర్తిగా కట్టాను. అయినా ఇంకా చెల్లించాలని యాప్ నిర్వాహకులు వేధిస్తున్నారు. లేనిపక్షంలో నా ఫొటోలను మార్ఫింగ్ చేసి కుటుంబసభ్యులకు, ఫోన్‌లోని కాంటాక్ట్ నంబర్లకు పంపిస్తామని బెదిరిస్తున్నారు' అంటూ అల్లూరుకు చెందిన ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నెల్లూరు ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 85 మంది విచ్చేసి తమ సమస్యలను అర్జీల రూపంలో ఎస్పీకి అందజేశారు. వాటిని పరిశీలించిన ఎస్పీ చట్టపరిధిలో విచారించి న్యాయం చేస్తామని అర్జీదారులకు భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీటీసీ డీఎస్పీ గిరిధర్, న్యాయ సలహాదారులు శ్రీనివాసులురెడ్డి, ఎస్‌బీ, మహిళా పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

➡ ముత్తుకూరుకు చెందిన అరవింద్ దర్గామిట్టలోని నా ఇంట్లో అద్దెకున్నాడు. ఆశా ఫౌండేషన్ ట్రస్ట్ ఏర్పాటు చేద్దామని, తద్వారా రెట్టింపు నగదు సంపాదించవచ్చని నమ్మించి నా వద్ద, నాకు తెలిసిన వారి వద్ద రూ.80 లక్షలు తీసుకుని ఉడాయించాడు. అతడి ఆచూకీ తెలుసుకుని న్యాయం చేయాలని దర్గామిట్టకు చెందిన ఆషా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

➡ సైబర్ నేరగాళ్లు నా ఫోన్‌ను హ్యాక్ చేసి క్రెడిట్ కార్డులోని రూ.54,949 నగదును ఖర్చు చేశారని బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన ఓ యువకుడు అర్జీ ఇచ్చాడు.

➡ బ్యాంకులో ఉద్యోగం ఇప్పిస్తానని బెనర్జీ అనే వ్యక్తి రూ.10 లక్షలు తీసుకుని మోసగించాడని నెల్లూరు వేదాయపాళేనికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు.

➡ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని ప్రకాశం జిల్లాకు చెందిన రవితేజ రూ.7.50 లక్షలు తీసుకుని మోసగించాడని విచారించి న్యాయం చేయాలని వెంకటాచలానికి చెందిన ఓ యువకుడు కోరాడు.

➡ కష్టపడి సంపాదించిన భూమిని నా కుమారులు లాక్కున్నారు. దీంతో జీవనం కష్టంగా మారింది. వారిపై చర్యలు తీసుకుని భూమిని ఇప్పించాలని ఓ తండ్రి ఫిర్యాదు చేశాడు.

➡ ప్రసాద్, వెంకటసుబ్బయ్య అనే వ్యక్తులు నాపై దాడి చేయడమే కాకుండా కులం పేరుతో దూషిస్తూ చంపుతామని బెదిరిస్తున్నారు. వారి నుంచి ప్రాణహాని ఉంది. రక్షణ కల్పించాలని మర్రిపాడుకు చెందిన ఓ వ్యక్తి అర్జీ ఇచ్చాడు.

పంటకాలువలో మృతదేహం

మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలులో హైవేకు తూర్పు వైపున పంటకాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని సోమవారం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్సై శివరాకేష్ ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మృతుడి శరీరంపై డ్రాయర్ మాత్రమే వుంది. వయసు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.